JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | శనివారం 25-10-2025
Medchal - Malkajgiri | Saturday 25-10-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 148 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 148 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





## మరింత బలపడనున్న త్రివిధ దళాలు

జయభేరి, న్యూఢిల్లీ అక్టోబరు 24:

భారత సైన్యం , నౌకాదళం, వైమానిక దళాల కోసం దాదాపు రూ.79 వేల కోట్ల విలువైన కీలక రక్షణ కొనుగోళ్లకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన రక్షణ కొనుగోలు మండలి ఆమోదం తెలిపింది. తొలి దశ ఆమోదంతో.. దేశ రక్షణ సామర్థ్యాలు గణనీయంగా పెరగనున్నాయి. ఇండియన్ నేవీకి ల్యాండింగ్ ప్లాట్‌ఫామ్ డాక్‌లు, సముద్రపు దొంగల నిరోధక పాత్రల కోసం 30ఎంఎం నేవల్ సర్ఫేస్ గన్స్, డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ లైట్‌వెయిట్ టార్పెడోలు వంటి వాటి కొనుగోలుకు ఆమోదం లభించింది. ఇక ఇండియన్ ఆర్మీ కోసం.. నాగ్ క్షిపణి వ్యవస్థ ఎంకేII, నిరంతర ఎలక్ట్రానిక్ నిఘా కోసం జీబీఎమ్ఈఎస్, లాజిస్టిక్ మద్దతు కోసం హెచ్‌ఎంవీల కొనుగోలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు.. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కోసం సీఎల్‌ఆర్‌టీఎస్, సీఎల్‌ఆర్‌డీఎస్ వంటి అత్యాధునిక వ్యవస్థల కొనుగోళ్లకు ఆమోదం లభించింది.భారత నౌకాదళం, కోస్ట్ గార్డ్ సామర్థ్యాలను పెంచడానికి అనేక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ల్యాండింగ్ ప్లాట్‌ఫామ్ డాక్‌లు కొనుగోలు చేయడంతో నేవీ, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ త్రివిధ దళాలతో కలిసి ఆపరేషన్లు చేపట్టగలుగుతుంది. శాంతి పరిరక్షణ, మానవతా సహాయం, విపత్తు ఉపశమనం వంటి మిషన్లలో కూడా ఈ ల్యాండింగ్ ప్లాట్‌ఫామ్ డాక్‌లు కీలకం కానున్నాయి. ఇక 30 ఎంఎం నేవల్ సర్ఫేస్ గన్స్ సముద్రంలో తక్కువ తీవ్రత గల ఆపరేషన్లు, సముద్రపు దొంగల నిరోధక పాత్రలలో నౌకాదళం, కోస్ట్ గార్డ్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచనున్నాయి. డీఆర్‌డీఓకు చెందిన నావల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లాబొరేటరీ దేశీయంగా అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ లైట్‌వెయిట్ టార్పెడోలు..

...మిగతాది 2 లో

# సంచలన నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం

## ఆ కలెక్టర్ పోస్టులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ..



తెలంగాణ ప్రభుత్వం అటవీ భూములకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని జిల్లాల్లోని అదనపు కలెక్టర్లను ఇకపై ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌లుగా నియమిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాటు.. గతంలో ఉన్న జాయింట్ కలెక్టర్ పదవిని రద్దు చేసి.. ఈ కొత్త బాధ్యతలను అదనపు కలెక్టర్లకు అప్పగించారు. దీనివల్ల అటవీ భూ సర్వే , హక్కుల నిర్ధారణ, సెటిల్‌మెంట్ పనులు వారి పరిధిలోకి వస్తాయి. ఈ చర్యలను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పర్యవేక్షణలో అమలు చేయనున్నారు.

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో ఒక కీలకమైన మార్పును తీసుకొచ్చింది. అటవీ భూములకు సంబంధించిన సమస్యలను వేగంగా.. పారదర్శకంగా పరిష్కరించే ఉద్దేశంతో జాయింట్ కలెక్టర్ పదవిని రద్దు చేసి.. అదనపు కలెక్టర్లకు కొత్త బాధ్యతలను అప్పగించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లను ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

### అదనపు కలెక్టర్లకు అటవీ బాధ్యతలు..

తెలంగాణ ప్రభుత్వం ఈ నియామకాలను 1967 ఫారెస్ట్ యాక్ట్, 1927 నాటి చట్టాల నిబంధనల కింద అమలు చేస్తోంది. ఈ మార్పు ద్వారా పాలనలో వేగం, జవాబుదారీతనం పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌ల ప్రాథమిక విధి అటవీ భూముల హక్కుల నిర్ధారణ, అటవీ ప్రాంతాల పరిధిని నిర్ధారించడం. ఈ నూతన బాధ్యతల కింద అటవీ భూ సర్వే నిర్వహించడం, హక్కుల నిర్ధారణ ప్రక్రియను పర్యవేక్షించడం, సెటిల్‌మెంట్ పనులను పూర్తి చేయడం వంటివి ఉంటాయి.


FSOలు భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించడం, అవకతవకలు ఉన్నవాటిపై విచారణ నిర్వహించడం, అటవీ భూములకు సంబంధించిన ప్రకటనలు జారీ చేయడం వంటి చట్టపరమైన కార్యకలాపాలను నిర్వహిస్తారు. వారికి అటవీ ప్రాంతంలోకి ప్రవేశించే అధికారం కూడా ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పర్యవేక్షణలో అమలు చేయనున్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు , రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించింది.

### అదనపు కలెక్టర్ల సాధారణ విధులు..

ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్గా కొత్త బాధ్యతలు అప్పగించబడినప్పటికీ, అదనపు కలెక్టర్లు వారి సాధారణ పరిపాలనా విధులను కూడా నిర్వహించవలసి ఉంటుంది. అదనపు కలెక్టర్లు జిల్లా కలెక్టర్‌కు ముఖ్య సహాయకులుగా ఉండి రెవెన్యూ కార్యకలాపాలు, భూముల కేటాయింపులు , పౌర సరఫరాలు, భూభారతి వంటి కీలక అంశాలను పర్యవేక్షిస్తారు. అదే విధంగా

...మిగతాది 2 లో

## సీఎం రేవంత్ రెడ్డి దమ్ముంటే రా..!



- పోలీసులు లేకుండా ఒక్కసారి చిక్కడపల్లి లైబ్రరీకి రావాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్

జయభేరి, హైదరాబాద్, అక్టోబర్ 24 :

సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే పోలీసులు లేకుండా ఒక్కసారి అశోక్‌నగర్, చిక్కడపల్లి లైబ్రరీకి రావాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. బట్టలూడదీసి ఊడగొడుతారు అని హరీశ్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. ఇచ్చిన మాట నిలుపుకో అని బాకీ కార్డులు రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల ముందు వేడుకున్నడు, వాడుకున్నడు. అధికారంలోకి వచ్చాక వదిలేసారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లతో అశోక్ నగర్, సరూర్ నగర్ స్టేడియంలో మీటింగులు పెట్టించారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అని మాయ మాటలు చెప్పారు. మోసం చేసారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదు గానీ, రెండు నెలల ముందే మద్యం నోటిఫికేషన్లు ఇచ్చిండు. జాబ్ క్యాలెండర్ అని జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసారు. జాబ్ క్యాలెండర్‌లో చెప్పినట్లు ఒక్క నోటిఫికేషన్ అయినా ఇచ్చారా రేవంత్ రెడ్డి. 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ బోగస్. రాజీవ్ యువ వికాసం వికసించకముందే వాడిపోయింది. జూన్ 2 నాడు 5 లక్షల మంది నిరుద్యోగులకు యువ వికాసం కింద సాయం చేస్తం అన్నడు. మాటలు బోగస్ హామీలు బోగస్ అయ్యాయని హరీశ్‌రావు మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిండు. రేవంత్ రెడ్డి కళ్లు తెరిపించేందుకు మీ చేతిలో అవకాశం ఉంది.

...మిగతాది 2 లో

## 4 గంటల్లో సింగపూర్



జయభేరి, విజయవాడ, అక్టోబరు 24 :

ఏపీలో అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఇప్పటికే పనులు ప్రారంభం అయ్యాయి. మరోవైపు ప్రైవేటు సంస్థలకు కేటాయించిన భూముల్లో నిర్మాణాలు ప్రారంభించాయి. ఒకేసారి 12 ప్రధాన బ్యాంకుల కేంద్ర కార్యాలయాల నిర్మాణం ప్రారంభం కానుంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ సమక్షంలో వాటికి శంకుస్థాపన జరగనుంది. ప్రపంచ దిగ్గజ పర్యాటక సంస్థలు అమరావతికి వస్తున్నాయి. పేరు మోసిన హోటళ్ల నిర్మాణం కూడా జరగనుంది. ఇటువంటి తరుణంలో విజయవాడ విమానాశ్రయానికి ప్రముఖుల తాకిడి పెరిగింది. అందుకే కొత్త విమాన సర్వీసులు అందుబాటులోకి వస్తున్నాయి. పలు ప్రైవేటు విమానయాన సంస్థలు సైతం

...మిగతాది 2 లో




## ప్రమాద ఘటనపై ఉన్నతస్థాయి కమిటీ

- ప్రమాదం ఎలా జరిగిందో తేల్చేందుకే 4 బృందాలు
- హోం మంత్రి అనిత

జయభేరి, కర్నూలు :

ప్రమాదం నుంచి 27 మంది సురక్షితంగా బయటపడ్డారు. 19 మంది ప్రాణాలు కోల్పోయారు. బస్సు డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నాడు.. ప్రమాదంపై దర్యాప్తు జరుగుతోందని హోం మంత్రి అనిత అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. టూవీలర్ను బస్సు ఢీకొనడంతో మంటలు చెలరేగాయి.. ప్రమాదం ఎలా జరిగిందో తేల్చేందుకే 4 బృందాలు పనిచేస్తున్నాయి. ఏపీకి చెందిన మృతులకు రూ.5 లక్షలు, గాయపడ్డవారికి రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తాం. తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలు కూడా వాళ్ల ప్రయాణికులకు ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నాయని అన్నారు. ఉదయం 6 గంటలకు ఘటనాస్థలికి వచ్చి పరిస్థితిని సమీక్షించాం. బస్సులో 36 మంది పెద్దవాళ్లు, నలుగురు చిన్నారులు ఉన్నారు.. మృతుల్లో బాపట్ల, నెల్లూరు, కోనసీమ జిల్లాల వాళ్లు ఉన్నారు. ఒక మృతదేహాన్ని ఇంకా గుర్తించాల్సి ఉంది.. గుర్తుపట్టలేని విధంగా మృతదేహాలు కాలిపోయాయి. మృతదేహాలు గుర్తించేందుకు బృందాలు ఏర్పాటు చేశాం.. ప్రమాదంపై 16 ఫోరెన్సిక్ బృందాలు ఏర్పాటు చేశాం. బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నాం.. మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి అని అన్నారు. బస్సుకు ఆలిండియా పర్మిట్ , ఫిట్నెస్ పత్రాలు ఉన్నాయి.. నిందితులు అందరిపై చర్యలు ఉంటాయి.. ఇప్పటికే కేసులు పెట్టాం. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.. ప్రమాద ఘటనపై ఉన్నతస్థాయి కమిటీ వేస్తామని అన్నారు.



## ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 24:

హైదరాబాద్ శివారులోని పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి దూలపల్లి పారిశ్రామిక వాడలో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. క్రౌన్ పాలిమర్ పరిశ్రమలో షాట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలం చేరుకొని మంటలను 10 గంటలు శ్రమించి 5 ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. సరియైన ఫైర్ సేఫ్టీ లేకపోవడమే? ఇంతటి పెద్ద అగ్ని ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. 5 ఫైర్ ఇంజిన్లు, ఒక రోబో మిషన్, 2 అంతస్తులకు ఫైర్ అంటుకోవడంతో మంటలు ఆర్పేందుకు ఫైర్ సిబ్బందితో పాటు డిఆర్ఎఫ్ సిబ్బంది, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ సహకారంతో మంటలు ఆదుపులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. క్రౌన్ పాలిమర్ పరిశ్రమకు సరైన ఫైర్ సేఫ్టీ లేకపోవడమే ఈ అగ్ని ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన బిల్డింగ్ స్టీల్ ప్లేస్ త్రీ ఫ్లోర్స్ ఉండడం పైప్ లైన్‌తో ఉండాల్సిన ఫైర్ సేఫ్టీ నామమాత్రపు అనుమతులతో ఈ పరిశ్రమ నడుస్తున్నట్టు సమాచారం. జీడిమెట్ల పారిశ్రామిక వాడ మరియు దూలపల్లి పారిశ్రామికవాడలో అనేక కంపెనీలలో కంపెనీకి తగ్గట్టుగా సరియైన ఫైర్ సేఫ్టీ లేకపోవడం ఇలాంటి భారీ అగ్ని ప్రమాదాలకు దారితీస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తారని ఫైర్ అధికారులపై ఫైర్ అవుతున్నారు. తర్వాత వెళ్లిపోతారని పట్టించుకోరని అంటున్నారు. కొన్ని కంపెనీలకు ఫైర్ ఎన్‌ఓసీలు

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## సంచలన నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం

గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల స్థానిక సంస్థల అభివృద్ధి ప్రణాళికలను పర్యవేక్షిస్తారు. పరిశుభ్రత, పచ్చదనం వంటి ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయడం, వాటిని సమర్థవంతంగా నిర్వహించడం కోసం అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించడం వీరి ముఖ్య విధుల్లో భాగం. వీరు వివిధ ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తారు. పరిపాలన క్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ (ఇది రద్దైంది) తర్వాత వీరే (అదనపు కలెక్టర్) ముఖ్య స్థానంలో ఉంటారు.

## 4 గంటల్లో సింగపూర్

కొత్త సర్వీసులు నడిపేందుకు ముందుకు వస్తున్నాయి. ఆక్యుపెన్సీకి అనుగుణంగా సర్వీసుల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటున్నారు. తాజాగా ఇండిగో సంస్థ సింగపూర్ కు డైరెక్ట్ ఫ్లైట్ను ప్రారంభించింది. ఎందుకు ముహూర్తంతో పాటుగా టికెట్ ధర, విమాన వేళలను సైతం సంస్థ ప్రకటించింది. తద్వారా నాలుగు గంటల్లో సింగపూర్ కు వెళ్లే అవకాశం దక్కుతోంది. సింగపూర్ తో ఏపీకి ప్రత్యేక అనుబంధం ఉంది. అక్కడ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా ఎక్కువ. ఏపీకి చెందిన లక్షలాది మంది అక్కడ స్థిరపడ్డారు. వర్తక, వాణిజ్య అవకాశాలు కూడా అక్కడ ఎక్కువ. ఈ తరుణంలో సింగపూర్ కు విమాన రాకపోకలు పెరిగాయి. దీనిని గుర్తించిన ఇండిగో సంస్థ విజయవాడ నుంచి నేరుగా సింగపూర్ కు విమాన సర్వీసులు ప్రారంభించనుంది. నవంబర్ 15 నుంచి ఈ సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. దీనికి సంబంధించిన చార్జీలు, టైమింగ్స్ ను సైతం ప్రకటించారు.సామాన్య మధ్య తరగతి ప్రజల అవసరాల దృష్ట్యా టికెట్ ధరలను అందుబాటులోకి ఉంచింది ఇంటికివ సంస్థ. టికెట్ ధరను ఎనిమిది వేల రూపాయలుగా నిర్ణయించింది. సింగపూర్ నుంచి బయలుదేరే విమానం ఉదయం 7:45 గంటలకు విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటుంది. అదే విమానం ఉదయం 10 గంటలకు తిరిగి బయలుదేరుతుంది. మధ్యాహ్నం రెండు ఐదు గంటలకు సింగపూర్ లోని సాంగి విమానాశ్రయానికి చేరుకుంటుంది. ప్రయాణ సమయం కేవలం నాలుగు గంటల మాత్రమే. ఇప్పటికే ఈ విమానానికి సంబంధించిన టిక్కెట్ల విక్రయాలు కూడా ప్రారంభం అయ్యాయి. అయితే వారంలో మూడు రోజులపాటు మాత్రమే ఈ సర్వీసులు నడవనున్నాయి. మంగళవారం, గురువారం, శనివారం మాత్రమే ఈ విమానాలు నడుస్తాయి. 180 నుంచి 230 సీట్ల సామర్థ్యం వరకు ఉంటుంది. అయితే ప్రయాణికుల రద్దీ పెరిగితే మాత్రం ఇండిగో విమాన సర్వీసుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

## సీఎం రేవంత్ రెడ్డి దమ్ముంటే రా..!

కొంతమంది నిరుద్యోగులు కూడా నామినేషన్లు వేసారు. కాంగ్రెస్ పార్టీని చిత్తుగా జూబ్లీహిల్స్‌లో ఓడించాలె. ఆనాడు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు బస్సు యాత్ర చేసారు. కాంగ్రెస్‌కు సురుకు పుట్టాలంటే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు నిరుద్యోగులు దండు కట్టాలె. నిరుద్యోగ యువకులే కాంగ్రెస్‌ను ఓడించారనే విషయం రాహుల్ గాంధీకి అర్థం కావాలె. తనతప్పు తాను తెలుసుకునేందుకు మనం కాంగ్రెస్‌ను ఓడించాలె అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

## మరింత బలపడనున్న త్రివిధ దళాలు

సంప్రదాయ, అణు, మిడ్జెట్ జలాంతర్గాములను లక్ష్యంగా చేసుకోగలవు. 76 ఎంఎం సూపర్ రాపిడ్ గన్ మౌంట్ కోసం ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ సెర్చ్ అండ్ ట్రాక్ సిస్టమ్, స్మార్ట్ మందుగుండు సామగ్రి కొనుగోలుకు కూడా ఆమోదం లభించింది.సైన్యం కోసం భూతల యుద్ధ సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ కొనుగోళ్లు సహాయపడనున్నాయి. ట్రాక్డ్ వెర్షన్ అయిన నాగ్ క్షిపణి వ్యవస్థ ఎంకేII కొనుగోలుతో శత్రు యుద్ధ వాహనాలు, బంకర్లు, ఇతర రక్షణ కట్టడాలను సమర్థవంతంగా నియంత్రించే సామర్థ్యం భారత సైన్యానికి లభిస్తుంది. గ్రౌండ్ బేస్డ్ మొబైల్ ఈఎల్ఐఎన్‌టీ ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ శత్రువుల ఎమిటర్ల నుంచి నిరంతర నిఘా సమాచారాన్ని సేకరించి అందిస్తుంది. మెటీరియల్ హ్యాండ్లింగ్ క్రేన్‌తో కూడిన ఈ హై మొబిలిటీ వెహికల్స్ వివిధ భౌగోళిక ప్రాంతాల్లో సైన్యానికి లాజిస్టిక్ మద్దతును గణనీయంగా మెరుగుపరుస్తాయి.భారత వైమానిక దళం కోసం కొలాబరేటివ్ లాంగ్ రేంజ్ టార్గెట్ సాచురేషన్/డిస్ట్రక్షన్ సిస్టమ్ ప్రతిపాదనకు రక్షణ శాఖ ఆమోదం కల్పించింది. ఈ వ్యవస్థ స్వతంత్రంగా టేకాఫ్, ల్యాండింగ్, నావిగేటింగ్, లక్ష్యాన్ని గుర్తించడం, మిషన్ ఏరియాలో పేలోడ్‌ను అందించడం వంటి సామర్థ్యాలను కలిగి ఉంటుంది.

## ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

లేకుండా కూడా నడిపిస్తున్నారు. అగ్ని ప్రమాదాలకు సంబంధించిన ఘటనలు అనేకంగా జరిగిన అటు అధికారులు కావచ్చు ఇటు కంపెనీ యాజమాన్యాలు కావచ్చు తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఈ అగ్ని ప్రమాదాలకు కారణమని స్థానికులు తెలిపారు. ఒక కంపెనీ ప్రారంభిస్తున్నారు అని అంటే కంపెనీకి సంబంధించిన ఎన్వోసీలు ప్రతి డిపార్ట్మెంట్ నుంచి ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్స్పెక్టర్ వచ్చి పరిశీలించాలి. ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు సరిగ్గా చేయకపోవడమే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అతున్నాయని స్థానికులు తెలిపారు. అన్ని డిపార్ట్మెంట్ అధికారులు ప్రమాదాలు జరిగినప్పుడే వచ్చి హడావుడి చేయడం షరా మామూలుగా మారింది. క్రౌన్ పాలిమర్ కంపెనీల్లో ఆస్తి నష్టమే జరిగింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణాష్టం జరగలేదు. ప్రాణనాష్టం జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహిస్తారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కంపెనీల్లో ఎలాంటి ఫైర్ సేఫ్టీ ఉంది? కంపెనీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సరిగా ఉన్నాయా లేవా అని అధికారులు వచ్చి తరచూ తనిఖీలు నిర్వహిస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. క్రౌన్ పాలిమర్ కంపెనీ పైన సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే మరి.

## బస్సు దగ్ధం ఘటన దురదృష్టకరం

■ పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం



జయభేరి, అమరావతి:

హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న వేమూరు ట్రావెల్స్ కు చెందిన ప్రైవేట్ బస్ కర్నూల్ జిల్లా చిన్నటేకూరు వద్ద బైక్ ను ఢీకొని మంటలు చెలరేగడంతో బస్ దగ్ధమై, ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకున్న ఘటన తీవ్రంగా కలచివేసిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ అన్నారు. . ఈ ఘటనలో ఇప్పటికే 10 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ప్రభుత్వం తరపున సూచించడం జరిగింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని రకాలుగా భద్రతా ప్రమాణాలు ఉండేలా చర్యలు చేపట్టాలని రవాణా శాఖ వారికి విజ్ఞప్తి చేస్తున్నాని అన్నారు.

# వెల్‌కం బ్యాక్ ఇండియా.. మోదీ కొత్త వ్యూహం!

**అమెరికా ఫస్ట్.. గ్రేట్ అమెరికా మేక్ ఎగైన్ నినాదాలతో అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన ట్రంప్.. తన 2.0 పాలనలో హామీల అమలుకు ప్రపంచ దేశాలతోపాటు ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం అమెరికా వెళ్లినవారిని ఇబ్బందులు పెడుతున్నారు. మొదట అక్రమంగా వెళ్లినవారిని గుర్తించి పంపించారు. ఇప్పుడు హెచ్–1బీ వీసాపై ఉంటున్నవారిపై అధిక ఫీజుల భారం మోపుతున్నారు. కొత్త హెచ్–1బీ వీసాల జారీపై ఆంక్షలు విధించారు.**



అమెరికా కంపెనీలు ఉద్యోగాల్లో అమెరికన్లకే మొదటి ప్రధాన్యం ఇవ్వాలని హుకూం జారీ చేశారు. యూనివర్సిటీల నిధుల్లో కోత విధించారు. వీటి ప్రభావం ఎక్కువగా భారత్, చైనాపై పడుతోంది. భారతీయ విద్యార్థులు, ఐటీ నిపుణులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్నత విద్యా వ్యవస్థపై ట్రంప్ పరిపాలన ఆంక్షలు విధించడం భారతీయ పరిశోధకులు, విద్యావేత్తలకు కొత్త అవకాశాలు తెలిపింది. ఈ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం విదేశాల్లో స్థిరపడిన భారత మూలాల నిపుణులను దేశానికి తీసుకురావడానికి ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తోంది. ఇది దేశీయ ఆవిష్కరణలను బలపరచడానికి ఒక వ్యూహాత్మక చర్యగా కనిపిస్తోంది.డొనాల్డ్ ట్రంప్ పరిపాలన 'కాంపాక్ట్ ఫర్ అకాడమిక్ ఎక్సెలెన్స్' అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఇది యూనివర్సిటీలకు ఫెడరల్ నిధులను ఆధారాలుగా మారుస్తుంది. విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితులు, జాతి లేదా లింగ ఆధారిత చేరికలపై నిషేధాలు, ఫీజు ఆక్షేపణలు వంటి షరతులు విధించబడుతున్నాయి. హార్వర్డ్ వంటి ప్రముఖ సంస్థలకు బిలియన్ల డాలర్ల గ్రాంట్లు ఆపేశారు, ఇది విద్యా స్వాతంత్ర్యానికి ఆటంకం కలిగిస్తోందని విమర్శకులు అంటున్నారు. ఈ మార్పులు భారతీయ నిపుణులకు ఉద్యోగ అవకాశాలను తగ్గించాయి. దీంతో భారత్ వారిని తిరిగి తీసుకురావడానికి అనుకూల వాతావరణం ఏర్పడింది. ఈ కొత్త పథకం విదేశాల్లో విజయవంతమైన భారతీయ మూలాల 'స్టార్ ఫ్యాకల్టీ'ని లక్ష్యంగా చేసుకుంది. వారు దేశంలో నిర్దిష్ట కాలం పరిశోధన చేసి, ఐఐటీలు, డీఎస్‌టీ, డీబీటీ కింది ల్యాబ్‌లలో పూర్తి స్థిరపడేలా ప్రోత్సహిస్తుంది. ఈ ప్రణాళిక క్యాబినెట్ ఆమోదం పొందిన తర్వాత అమలు అవుతుంది.ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయం ఈ ప్రక్రియకు నాయకత్వం వహిస్తోంది.

ఉన్నత విద్యా శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం, బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ నిపుణులతో సమావేశాలు జరుగుతున్నాయి. ఐఐటీ డైరెక్టర్లు చర్చల్లో పాల్గొన్నారు. ప్రారంభంలో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్)లో 12-14 ముఖ్య రంగాలపై దృష్టి పెట్టనున్నారు. జాతీయ అభివృద్ధికి కీలకమైన ఈ రంగాలు ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి ఎంపిక చేయబడ్డాయి.ఈ పథకం భారత్‌ను ప్రపంచ ప్రతిభా ఆకర్షణలో ముందు నిలుపుతుంది. విదేశాల్లో ఉన్న నిపుణులను తిరిగి తీసుకురావడం ద్వారా పరిశోధనా సామర్థ్యాన్ని పెంచి, సహకారాలను బలోపేతం చేస్తుంది. దీర్ఘకాలిక బంధాలు ఏర్పడటం ద్వారా దేశీయ విద్యా వ్యవస్థకు గ్లోబల్ మాన్యం పెరుగుతుంది. అటల్ ఇన్నోవేషన్ మిషన్ మాజీ డైరెక్టర్ చింతన్ వైష్ణవ్ ప్రకారం, 'భావోద్వేగ సాన్నిహిత్యం, సులభమైన అమలు' ద్వారా ప్రతిభలను ఆకర్షించవచ్చు. ప్రభుత్వం నుంచి లేదా విద్యా శాఖ నుంచి ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇది అనిశ్చితిని పెంచుతోంది. ట్రంప్ ప్రభుత్వం విదేశీ విద్యార్థులకు వీసా నిబంధనలను కఠినతరం చేస్తోంది. దీని ప్రకారం, విద్యార్థులు 4 సంవత్సరాలకు మించి అమెరికాలో ఉండటానికి వీలుండదు. ఈ ప్రతిపాదన భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనుంది. భారత ప్రభుత్వం కెనడా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాలతో కలిసి భారతీయ విద్యార్థులకు అనుకూలమైన విధానాలను రూపొందించడానికి ప్రయత్నిస్తోంది.

అలాగే మోదీ జపాన్ పర్యటనలో ఇండియా యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కూడా జరిగింది. ఇది జపాన్ అభివృద్ధికి కూడా తొడ్పడనుంది. ఐదేళ్లలో 50 వేల మంది నైపుణ్యం కలిగిన అర్ధనైపుణ్య కార్మికులను భారతదేశం నుంచి జపాన్‌కు పంపాలని నిర్ణయించారు. దీని ద్వారా జపాన్ ఎదుర్కొంటున్న కార్మికుల కొరత సమస్యను పరిష్కరించడానికి భారత్ సహాయ పడుతుంది.

అలాగే ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్యను తగ్గించడానికి దేశీయ విద్యా సంస్థలలో నాణ్యత, పరిశోధనలను మెరుగుపరచడంపై ఇండియా దృష్టి సారించింది. వీసా విధానాలపై అమెరికా ప్రభుత్వంతో దౌత్య స్థాయిలో చర్చలు జరపడానికి ఇప్పటికీ భారత్ సిద్ధంగా ఉం భారత్‌లో ప్రొఫెసర్ వేతనాలు (సుమారు 38 వేల డాలర్లు) అమెరికా (1.3-2 లక్షల డాలర్లు)తో పోలిస్తే తక్కువగా ఉండటం, బ్యూరోక్రటిక్ అడ్డంకులు, పరిమిత నిధులు, దీర్ఘకాలిక కాంట్రాక్టుల లోపం వంటి సమస్యలు ఉన్నాయి. వీటిని అధిగమించకపోతే, పథకం పరిమిత ప్రభావానికి మాత్రమే పరిమితమవుతుంది. ఈ ప్రణాళిక భారత్‌లో విద్యా-పరిశోధనా రంగానికి ఒక కీలక మలుపు. కానీ అమలు బలోపేతంపై ఆధారపడి ఉంటుంది. గ్లోబల్ పోటీలో భారత్ ముందుండాలంటే, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# లిక్కర్ లెక్కలు... కొడుకు కోసం జూపల్లి...




జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 24:

తెలంగాణ ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని హామీ ఇచ్చి.. ప్రజా పాలన అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా అడుగులు వేస్తున్నట్టు కనిపించడం లేదు. పైగా రోజుకొక వివాదంతో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో చులకన అవుతోంది. ఇటీవల మినిస్టర్లు సురేఖ, శ్రీనివాస్ రెడ్డి మధ్య వివాదం ఏర్పడిన విషయం తెలిసిందే. ఇది సద్దుమణిగిన తర్వాత తెరపైకి మరో వివాదం వచ్చింది. ఈసారి ఏకంగా ఒక ఐఏఎస్ అధికారి వాలంటరీ రిజైన్ కు సంబంధించింది. ఆ అధికారి ఏదో కావాలని వీఆర్ఎస్ తీసుకోలేదు. దాని వెనుక చాలా కారణాలు ఉన్నాయి.

ఇప్పుడు ఆ కారణాలే తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్నాయి. లిక్కర్ హోలోగ్రామ్ టెండర్ విషయంలో తెలంగాణలో కలకలం రేగింది. ఎక్సైజ్ శాఖలో కీలక అధికారిగా పనిచేస్తున్న ఐఏఎస్ సయ్యద్ రిజ్వీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చీఫ్ సెక్రటరీకి లేఖ రాశారు. తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాయడం కలకలం రేపుతోంది. డిపార్ట్‌మెంట్‌లోని ఉన్నతాధికారులు తన మాటను ఖాతరు చేయడం లేదని, ఆదేశాలను పాటించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ లేఖలో ఆరోపించారాయన.

వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న సీనియర్ ఐఏఎస్ సయ్యద్ అలీ ముర్తజా రిజ్వి టార్గెట్‌గా తీవ్ర ఆరోపణలు చేశారు మంత్రి జూపల్లి. ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వి, ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ ఇద్దరూ తన ఆదేశాల్ని పట్టించుకోకుండా... విధులకు ఆటంకాలు సృష్టిస్తున్నారన్నది మంత్రి బాధ. అయితే... లేఖ తర్వాత ఈ ఎపిసోడ్ కొత్త మలుపు తిరిగింది. మంత్రి తనమీద సీఎస్‌కు ఫిర్యాదు చేయడాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వి....స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ వీఆర్ఎస్‌కు అనుమతిస్తూ... సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు కూడా. అంతలోనే ఇంకో ట్విస్ట్ ఇచ్చారు మంత్రి. వీఆర్ఎస్‌కు రిజ్వీ పెట్టుకున్న దరఖాస్తును ఆమోదించ వద్దంటూ... సీఎస్‌కు మరో లేఖ రాశారాయన. ఈ నెల 31 నుంచి రిజ్వీ పదవీ విరమణ అమల్లోకి వస్తుందని బుధవారమే ఉత్తర్వులు కూడా జారీ చేసేశారు చీఫ్ సెక్రెటరీ. క్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు రెండో లేఖ ఇటు రాజకీయ వర్గాలు, అటు బ్యూరోక్రాట్స్‌లో చర్చనీయాంశం అయింది. మంత్రి లేఖతో ఒక్కసారిగా ఎక్సైజ్ శాఖలో అంతర్గత విభేదాలు బయటపడ్డట్టయింది. రిజ్వీ వీఆర్ఎస్‌కు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇవ్వొద్దంటూ... సీఎస్‌తో వదిలిపెట్టకుండా ఏకంగా సీఎం రేవంత్ రెడ్డికి కూడా మంత్రి జూపల్లి లేఖ రాయడం ఇంకా కాక పెంచుతోంది. తన విషయంలో రిజ్వీ అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా... అక్రమాలకు పాల్పడ్డారంటూ తాజా లేఖలో ఆరోపించారు జూపల్లి. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని.. మంత్రిగా తన విధులకు కూడా ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. మద్యం బాటిళ్లపై సెక్యూరిటీ కోసం వేసే హోలోగ్రామ్ స్టిక్కర్ల కాంట్రాక్టును 11 ఏళ్లుగా ఒకే కంపెనీకి ఇస్తున్నారని, మరింత భద్రతతో, లేబుల్స్ మార్చి టెండర్లు పిలవాలని చెప్పినా కనీసం పట్టించుకోలేదని, మళ్లీ పాత వారికే కాంట్రాక్టు కట్టబెట్టారని లేఖలో ప్రస్తావించారు జూపల్లి.ఇక చిట్టి సృజన్ కేసులో బకాయిలతో పాటు కాంపౌండింగ్ ఫీజు విషయంలో ఇచ్చిన సూచనలను రిజ్వీ పెడచెవిన పెట్టారని తెలిపారు. క్యాప్రికార్న్ బ్లెండర్స్ నుంచి 6 కోట్ల 15 లక్షల రూపాయల్ని డెమరేజ్ చార్జీల కింద చట్టవిరుద్ధంగా వసూలుకు సంబంధించిన ఫైల్స్ ఇవ్వడానికి కూడా నిరాకరించారంటూ ఫైర్ అయ్యారు మినిస్టర్. టీజీబీసీఎల్ ఎండీ అడిగినా వివరాలు ఇవ్వకపోవడం దారుణమని, ఏబీడీ లిమిటెడ్ కంపెనీ మద్యం ఉత్పత్తి, గరిష్ట అమ్మకం ధర విషయంలో చేసిన జాప్యంతో సర్కార్ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లిందంటూ... సీఎం, సీఎస్‌కు రాసిన లేఖలో ఆరోపించారు జూపల్లి కృష్ణారావు. మరోవైపు లేబుల్స్, హోలోగ్రామ్ టెండర్ల విషయంలో ప్రభుత్వ నిబంధనల మేరకే నడుచుకున్నామని... ఉన్నతాధికారుల సూచనల ప్రకారం ఫైల్స్ మూవ్ చేశామంటున్నారు ఆఫీసర్స్. తెలంగాణ ప్రభుత్వానికి నష్టం వాటిల్లే పనులు చేయలేదని... విధుల పట్ల నిర్లక్ష్యం వహించ లేదని చెబుతున్నారు.

మంత్రి ఆదేశాలపై సీఎంవో అధికారులకు ఎప్పుడో సమాచారం ఇచ్చామని వివరణ ఇస్తున్నారు. ఈ పరిణామ క్రమంలో రిజ్వీ వీఆర్ఎస్‌పై ప్రభుత్వం ఎలా ముందుకు వెళ్తుందోనన్నది ఆసక్తిగా మారింది. అంతేకాదు వాలంటరీ రిటైర్మెంట్ కు దరఖాస్తు చేసిన రిజ్వీ వ్యవహారంలో లోతుగా దర్యాప్తు జరపాలని.. ఆయన దరఖాస్తును పక్కన పెట్టాలని కృష్ణారావు ఆ లేఖలో కోరారు. అంతేకాదు రిజ్వీ వ్యవహార శైలి వల్ల తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు తీవ్రంగా నష్టం వాటిలిందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం గురించి రకరకాల చర్చలు జరుగుతున్నాయి. రిజ్వీ కి ఇంకా మూడు సంవత్సరాల పదవి కాలం ఉంది. అయినప్పటికీ ఆయన వీఆర్ఎస్ తీసుకోవడం పట్ల రకరకాల చర్చలు జరుగుతున్నాయి. మద్యం మీద హోలోగ్రామ్ టెండర్ విషయంలో ప్రభుత్వంలోని ఓ కీలక నాయకుడు తన అల్లుడికి ఇవ్వాలని పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది.

మరోవైపు ఓ మంత్రి కూడా తన కుమారుడికి ఈ టెండర్ ఇవ్వాలని సదరు అధికారి మీద ఒత్తిడి తీసుకొస్తున్నట్టు సమాచారం. అందువల్లే రిజ్వి తట్టుకోలేక వాలంటరీ రిటర్మెంట్ కు దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. రిజ్వీ వ్యవహార శైలి పట్ల ఇప్పటికే మంత్రి కృష్ణారావు ఆగ్రహం గా ఉన్నారు. చీఫ్ సెక్రటరీ కి లేఖ కూడా రాశారు.. ఈ పరిణామాలు జరుగుతున్న నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో రిజ్వీ భేటీ అయ్యారు. అంతేకాదు క్యాబినెట్ సమావేశానికి ప్రిన్సిపల్ సెక్రటరీ హోదాలో ఆయన హాజరయ్యారు. ఈ పరిణామాలన్నీ తెలంగాణ రాజకీయాలలో అత్యంత చర్చకు దారి తీస్తున్నాయి. అయితే ఈ వ్యవహారం ఎక్కడికి దారితీస్తుంది? అనే ప్రశ్నకు త్వరలోనే సమాధానం లభించనుంది.

# జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ రాదు

- ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, అక్టోబర్ 24:**



జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి కనీసం డిపాజిట్ కూడా వచ్చే పరిస్థితిలో లేదని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్టలో ఆయన మాట్లాడుతూ.. పురాణాలలో కుంభకర్ణుడు ఆరు నెలలు తిని నిద్ర పోయినట్లుగా కేసీఆర్ రాజకీయం ఉందని హెద్దేవ చేశారు. కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి కాలు బయట పెట్టకుండా, ఫామ్ హౌస్ లోచెట్టు కింద హాయిగా కుర్చీ వేసుకొని, జల్సాలు చేస్తూ ప్రజలను పట్టించుకోకుండా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. రిటైర్మెంట్ అయి ప్రతిపక్ష నాయకుని బాధ్యత వేరొకరు అప్పగించాలని డిమాండ్ చేశారు. మరో పక్క రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం నిత్యం పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన బురద జల్లడం బురద జల్లడం తెలంగాణ ప్రజలు సహించారన్నారు. కనీసం బిఆర్ఎస్ పార్టీ ఆఫీసుకు కూడా రాకుండా నాయకులనే ఫామ్ హౌస్ కు పిలిపించుకుంటు రాజకీయాలు నడపాలి అనుకుంటున్నా ఆయనకు పార్టీ మీద ఆ పార్టీ నాయకుల మీద ఉన్న గౌరవం ఏమిటో తెలంగాణ ప్రజలు చూస్తున్నారన్నారు. అధికారం ఉన్నప్పుడు ఫామ్ హౌస్, పోయాక కూడా ఫామ్ హౌస్ కే పరిమితం అయ్యారన్నారు.

రోజుకు 18 గంటలు పనిచేసే మా ముఖ్యమంత్రిని విమర్శించే నైతిక హక్కు కేసీఆర్ కు లేదు. జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ ఘనవిజయం ఖాయమని కేసీఆర్ అంటున్నాడు.. ఎందుకు గెలిపించాలో చెప్పలేని పరిస్థితిలో ఆ పార్టీ ఉందన్నారు. ముందు అసలు మీకు డిపాజిట్ వస్తుందో రాదో చూసుకో బీర్ల అయిలయ్య అన్నారు. బీఆర్ఎస్ ను గెలిపించడానికి కేసీఆర్ ఒక్క కారణం చెప్పాలన్నారు. తెలంగాణను నాశనం చేశావనే ఓడించి నిన్ను ఫామ్ హౌస్ లో కూర్చోబెట్టారన్నారు. ఇంకా ఏ మోహం పెట్టుకుని జూబ్లీహిల్స్ లో ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ రౌడీ షీటర్ కు టికెట్ ఇచ్చిందని కేసీఆర్ అనటం బాధాకరమన్నారు. ఒక బీసీ యాదవ బిడ్డను రౌడీషీటర్ అని కేసీఆర్ అవమానించాడు. బీసీలను రౌడీలుగా చూపించడానికి కేసీఆర్, కేటీఆర్ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు బీసీలు అంటే అంత చులకనగా కేసీఆర్ కు కనిపిస్తున్నారా.. అంటూ ప్రశ్నించారు.

బడుగు బలహీన వర్గాలను కించే పర్చేలా మాట్లాడుతున్న కేసీఆర్,కేటీఆర్ కు తగిన బుద్ధి చెప్పాలి అన్నారు. నవీన్ యాదవ్ పైన రౌడీ షీట్ ఉందా.. ఎన్ని కేసులు ఉన్నాయో కేసీఆర్ చూపించాలన్నారు అయ్య కేసీఆర్ ఏమో కాంగ్రెస్ అభ్యర్థి రౌడీ షీటర్ అంటాడు. కొడుకేమో సల్మాన్ ఖాన్ అనే రౌడీ షీటర్ కు కండువా కప్పి పార్టీలో చేర్చుకుంటడు తండ్రి కొడుకుల మాటల గారడి ప్రజలు ఎప్పుడు నమ్మరు ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య అన్నారు.

---



## మాల మహానాడు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుగా ఏకగ్రీవంగా ఎన్నిక

- మాలల హక్కులు కోసం పోరాడుతా.. సవాళ్ల వినోద్ కుమార్

**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 24 :**

జాతీయ, రాష్ట్ర మాల మహానాడు నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సవాళ్ల వినోద్ ను ఏకగ్రీవంగా ఎంపిక చేసిన మాల మహానాడు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బేగరి మహేష్.ఈ కార్యక్రమంలో మాల మహానాడు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బేగరి మహేష్ మాట్లాడుతూ; మాల మహానాడు సభ్యులు మాలల హక్కుల కోసం పోరాడాలని మాలలకు సంబంధించిన ఇటువంటి వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన రాదని సూచించారు. మాల మహానాడు సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల మహేష్ తదితరులు తనను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపిన వినోద్. ఈ సందర్భంగా మాల మహానాడు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు సవాళ్ల వినోద్ మాట్లాడుతూ; మాలల హక్కుల కోసం తాను ఎల్లవేళలా పోరాడుతానని అన్నారు.న్యాయబద్ధమైన మాలల హక్కుల కోసం నిరంతర కార్యక్రమాలు ఏర్పాటుచేసి రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు ఉన్న నాయకులతో కలసి ఐక్యతతో సభలు సమావేశాలు ఏర్పాటు చేసి తమ హక్కులను సాధించుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి మాల మహేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బేగరి మహేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

---

## అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోండి...

**జయభేరి, కొలిమిగుండ్ల అక్టోబర్ 24 :**

కొలిమిగుండ్ల మండలంలోని కలవటాల గ్రామానికి చెందిన రైతులు మొక్కజొన్న పంటను సాగు చేసుకున్నారు. రైతులు మొక్కజొన్న పంటను కోసి గింజలను ఆరబోసుకున్నారు. అకాల వర్షం కారణంగా ఆరబోసుకున్న గింజలు నానిపోయి మొలక ఎత్తి నష్టపోయామని తమను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు. ఎకరాకు 30 వేల రూపాయల పెట్టుబడి పెట్టి నష్టపోయామని తడిచిన ధాన్యాన్ని కింట 3000 రూపాయలతో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమకు ఆత్మహత్య శరణ్యమని రైతులు వాపోయారు. అనంతరం వ్యవసాయ అధికారి భాస్కర్ రెడ్డికి శుక్రవారం నాడు రైతులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కోట జగమేశ్వర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, గోపాల్ రెడ్డి, చెన్నారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పుల్లయ్య, పెద్దయ్య, వినయ్, యేసయ్య ఇంకా తదితర రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

# రైతులకు ఇచ్చిన హామీలలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం

**జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 24:**



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 22 నెలలు అయినా వరంగల్ రైతు సభ తీర్మానంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయిందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బిజెపి మండల పార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ అధ్యక్షతన తాసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ జహంగీర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా కింద కాంగ్రెస్ ప్రభుత్వం 12,000 మాత్రమే రైతు భరోసా వేస్తున్నారని ఇచ్చిన హామీ 15000 వెంటనే అమలు చేయాలని అన్నారు.

రైతులకు రెండు లక్షల రుణమాఫీ రాష్ట్ర మొత్తంలో 60 శాతం మాత్రమే పూర్తి చేశారని మిగిలిన నలభై శాతం కూడా వెంటనే భర్తీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ పసల్ యోజన పథకాన్ని రాష్ట్రంలో కూడా అమలు చేస్తామని వరంగల్ సభలో ఇచ్చిన హామీ ఇంకా నెరవేరలేదన్నారు. రైతులకు పోయిన యాసంగికి రావలసిన 500 రూపాయల బోనస్ ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో మొన్న కురిసిన ఆకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే అందివాలన్నారు. రైతులు వేసంగి పంటకు సిద్ధమవుతున్న వేల వెంటనే అన్నారు 10 సంవత్సరాలుగా విడుదల చేయని రైతులకు కావలసిన ఆ మాది డబ్బులను వెంటనే విడుదల చేయాలన్నారు. రైతులు వానాకాల పంట కోతలు మొదలైనవి కావున అమ్ముకోవడానికి ధాన్యం కొనుగోలు సెంటర్లను అన్ని చోట్ల వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ, మాజీ మండల అధ్యక్షుడు శత్రు నాయక్, చిన్న చలమయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ చాంద్ పాషా , జక్కుల వెంకటేశం గోర్ల రామచంద్రం, పాముల రామచంద్రం, మేకల పాండు, ఆకుల శీను,, గుండబోయిన మల్లేశం, ఆకుల భాస్కర్, కానుగంటి భాను, బొడ్డెల్లి శీను పాల్గొన్నారు.

---

# ప్రజల చూపంతా గులాబీ పార్టీ వైపే

- ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితి లేదు!
- కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు
- ఉమ్మడి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
- విస్తృతంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారం ప్రారంభం
- ప్రచారంలో పాల్గొన మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 24 :**



రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ గులాబీ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని ఎదురు చూస్తున్నారని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ లో జరగనున్న ఉపఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దివంగత నేత మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీత గెలుపు కోసం జూబ్లీహిల్స్ లోని సోమాజి గూడా డివిజన్ లోని ఎల్లారెడ్డి కాలనీల లో ఉన్న ప్రజల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ; ప్రజలందరూ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు.అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఉప ఎన్నికల్లో ఓటమి తప్పదని ప్రజలు కచ్చితంగా కాంగ్రెస్ పార్టీనీ గద్దె దింపుతారని, ఎటు చూసినా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుందని అన్నారు. జూబ్లీహిల్స్ లో ప్రజల నుండి బీఆర్ఎస్ పార్టీకి మాగంటి సునీత మంచి స్పందన వస్తుందని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగి పోయారని, కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు.కచ్చితంగా బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించబోతుందని ఆశాభావం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి .ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---

## ధాన్యం కొనుగోళ్లు చేయాలి

- రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి
- ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్

**జయభేరి, రాజన్న సిరిసిల్ల:**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 17 తేమ శాతం ఉన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్లపల్లి మండలంలోని మల్లాపూర్ లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం కుప్పలు పరిశీలించారు. ఇప్పటి దాకా ఎన్ని క్వింటాళ్ల ధాన్యం వచ్చింది? ఎంత కొనుగోలు చేశారో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ మాట్లాడారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 గా నిర్ణయించిందని తెలిపారు. వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు.

---



## నివాళులర్పించిన సోదా రామకృష్ణ

**జయభేరి, పరకాల, అక్టోబర్ 24:**

గురువారం పరకాల మున్సిపల్ పరిధిలోని 19వ వార్డు రాజపేట కాలనీ చెందిన ఏకు కార్తీక్ గారి తండ్రిగారు కీ,,శే,, ఏక్ శంకరయ్య గుండెపోటుతో మరణించగా ఐదవరోజు కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి మాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ, ఈ కార్యక్రమంలో రామకృష్ణతో పాటుగా మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఏకు రాజు, బొట్ల నరేష్, ఏకు రఘుపతి, రవికుమార్, దేవయ్య, సుధాకర్, రమేష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

---

## టాయిలెట్స్ నిర్మాణాలకు భూమిపూజ

- మల్లక్కపేట ఆలయ చైర్మన్, అంభీరు మహేందర్
- మల్లక్కపేట ఆలయంలో స్నానపు గదులు, టాయిలెట్ ల నిర్మాణం



**జయభేరి, పరకాల, అక్టోబర్ 24:**

పరకాల మండలంలోని మల్లక్క పేట అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ చైర్మన్ అంభీరు మహేందర్ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం స్నానపు గదులు, టాయిలెట్స్ నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరకాల ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, ఆలయ అర్చకులు కట్కూరి జగన్నాథచార్యులు, ఆలయ పాలకవర్గం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

---

## నూతన దంపతులను ఆశీర్వదించిన కాంగ్రేస్ నాయకులు



**జయభేరి, పరకాల, అక్టోబర్ 24:**

పరకాల పట్టణంలోని 3వ వార్డుకు చెందిన పోరండ్ల నిర్మలరమేష్ దంపతుల కుమారుడు రాముఅఖిల వివాహం హనుమకొండలోని డి కన్వెన్షన్ హాల్ జరగగా ఈ వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన పరకాల మాజీ శాసనసభ్యులు మొలుగూరి బిక్షపతి, దొమ్మాటి సాంబయ్య, పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ, సమన్వయ కమిటీ సభ్యులు దుబాసి వెంకటస్వామి, మెరుగు శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు దేవు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

---

## ప్రజా పల్లె దవాఖానాలో వైద్యం లేదు ఏకోసనా

- వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలి
- సూపర్వైజర్ పోస్టుపై అనుమానాలు నిగ్గు తేల్చాలి
- సిపిఎం డిమాండ్



**జయభేరి, గార్ల, అక్టోబర్ 24:**

ప్రతిష్టాత్మకంగా పల్లె ప్రజల ఆరోగ్య అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం లక్షల రూపాయల నిధులను వెచ్చించి సుందరమైన సువిశాలమైన అన్ని వసులతో కూడిన పల్లె దవాఖానాను కట్టించినప్పటికీ పిన్ని రెడ్డిగూడెం పల్లె దవాఖానాలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించకపోవడం విచారకరమని సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు,ఎం. నాగమణి,సి హెచ్.ఎల్లయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు.మండల పరిధిలోని పినిరెడ్డిగూడెం పల్లె దవాఖానా ఎదుట శుక్రవారం ఖాళీగా ఉన్న వైద్య సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పల్లె దవాఖానాలో ఎం ఎల్ హెచ్ పి, రెగ్యులర్ ఆశా కార్యకర్తలను,ఏఎన్ఎం లను నియమించాలని డిమాండ్ చేశారు.పల్లె దవాఖానాలో బిపి,షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో పాటు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.గ్రామాలలో తిమోఫాస్ దోమల మందు పిచికారి చేసి దోమతెరలు పంపిణీ చేయాలని,డ్రైడే ఫ్రైడే, శానిటేషన్ నిర్వహించాలని, పేద ప్రజలకు నెలవారి బీపీ, షుగర్ మాత్రలు ఇవ్వాలని రోగాల నివారణ పై ప్రజలను చైతన్య పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వంగూరి కొండయ్య, కేలోత్ బాల,గుగులోత్ సీతారాం, భద్రు, నారాయణ, బిక్షం ,రాందాస్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.




# దుద్దెనపల్లిలో విద్యుత్ అధికారుల పొలం బాట

**జయభేరి, సైదాపూర్, అక్టోబర్ 24 :**

సైదాపూర్ మండలం దుద్దెనపల్లి గ్రామంలో శనివారం రోజున గ్రామ రైతులతో విద్యుత్ అధికారులు టెక్నికల్ డి ఈ కరీంనగర్ కె ఉపేందర్ ఏఈ శ్రీనివాస్, ఆధ్వర్యంలో వినియోగదారులను ముఖ్యం గా రైతులను కలిసి ప్రమాదాల కొరకు వివరించారు విద్యుత్తు సరఫరా నాణ్యత విద్యుత్తు వాడకం వ్యవసాయ బావులు బోర్ బావుల కరెంటు అంతరాయాలు లాంటి విషయాలను తెలుసుకొని విద్యుత్తు సరపర పై సమస్యలపై సంబంధించిన విద్యుత్తు అధికారులు సమస్యలు పరిష్క రించడానికి ఈ కార్యక్రమము నిర్వహించామని వెల్లడించారు ఈ సందర్భంగా * టెక్నికల్ డి ఈ కే ఉపేందర్ * మాట్లాడుతూ.. రైతులకు విద్యుత్తు ప్రమాదల పై అవగాహన కల్పిస్తూ కరెంటు వైర్ల నుండి ట్రాన్స్ఫార్మర్ల నుండి తమకు తాము ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పిస్తూ మోటర్ స్టార్టర్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియపరచడం మోటర్ కనీసం ఇతర పంప్ సెట్ల నుండి వర్కింగ్ చేసే విధానం విద్యుత్తు ప్రమాదాల నుండి తమను తాము ఏలా కాపాడుకోవాలో అవగాహన కల్పించారు. మోటార్లకు కెపాసిటర్ల వలన కలిగే లాభాలను మరియు ఎలా బిగించుకోవాలో వాటి పట్ల జరిగే ప్రమాదాలను వివరించారు. ప్రమాదకరంగా ఉన్న వైర్లను లైన్ పై తక్కువ ఎత్తులో ఉన్న వైర్లను టీ ఆర్ గద్దెల వివరాలను విద్యుత్ కంచ ప్రమాదాలను వాటి పట్ల కల్పించే ప్రమాదలను వివరించారు. అలాగే టోల్ ప్రి నెంబర్ ద్వారా విధానం వివరించారు ఆయా ప్రాంతాల్లో రైతులను అవగాహన కల్పిస్తూ వంగిపోయిన స్తంభాలను సరిచేస్తూ వాటికి బదులుగా కొత్త స్తంభాలను బిగిస్తూ ఇంటి వైర్లను డి టి ఆర్ వద్ద ప్రమాదభ్రతంగా ఉన్న ఎర్త్ పైపులు సరి చేయడం వైర్ ట్రాన్స్ఫార్మర్లను ఏపీ స్విచ్ లోను బిగించడం వీలైతే సరి చేయడం హెచ్చిఎల్టి ఫీజులను డి టి ఆర్ లో లోడు బ్యాలెన్స్ చేయడం మొదలగు పనులను సరిచేయడం పొలంబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ కె శ్రీనివాస్ లైన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ లైన్మెన్ తిరుపతి రవి అసిస్టెంట్ లైన్మెన్ జగన్ కుమార్ విద్యుత్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు

# దుద్దెనపల్లి గ్రామంలో దొంగల బీభత్సం

**జయభేరి, సైదాపూర్ :**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల్ దుద్దెనపల్లి గ్రామంలో దొంగల బీభత్సం. అదును చూసి తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేసుకొని గురువారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొరగల్లా నర్సవ్వ అనే మహిళ ఇంటికి తాళం వేసి గురువారం చిగురుమామిడి మండలంలోని నవాపేట గ్రామంలో బంధువుల ఇంటికి ఓ కార్యక్రమానికి వెళ్లగా ఆ ఇంటికి తాళం ఉండడాన్ని గమనించిన దొంగలు రాత్రి ఆ ఇంటి తాళం ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడ్డారు. అలాగే హైదరాబాదులో ఉంటున్న బొరగాళ్ల రాజవ్వ ఇంటి తాళం పగలగొట్టారు బొల్లి నరేష్ అనే వ్యక్తికి సంబంధించిన సీసీ కెమెరాలు పగులగొట్టి సీసీ కెమెరాలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు నరసవ్వ రాజయ్య పక్కింటి వారు ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉండడం చూసి ఇంటి యజమానులకు ఫోన్ చేసి సమాచారం అందించారు ఈ రెండు ఇండ్లలో ఏమేమి వస్తువులు ఎత్తుకెళ్లారన్న విషయం యజమానులు వస్తనే తెలుస్తుందని సమాచారం ఈ దొంగల సమాచారాన్ని పోలీసు వారికి తెలిపినారు సమాచారం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది ఎంక్వయిరీ ప్రారంభించారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభం



**జయభేరి, సైదాపూర్ :**

వేసైదాపూర్ మండల కేంద్రంలో నీ పలు గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన కరీంనగర్ జిల్లా జాయింట్ కలెక్టర్ లక్ష్మి కిరణ్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల తహసిల్దార్ శ్రీనివాస్ గౌడ్ MPDO యాదగిరి, RDO రమేష్, Vసైదాపూర్ మండల AMC చెర్మెన్ దొంత సుధాకర్, LSCS వేసైదాపూర్ అధ్యక్షులు కొత్త తిరుపతి రెడ్డి, AMC vice చెర్మెన్ న్యాందడ్ల రాజుకుమార్ గౌడ్, amc డైరెక్టర్లు తాళపెల్లి వెంకటేశం, ఉడిగె రాజశేఖర్, Lscs మాజీ డైరెక్టర్ తాళ్లపల్లి వీరయ్య, యూత్ కాంగ్రెస్ మండల సెక్రెటరీ తిరుపతి నాయక్, మండల సోషల్ మీడియా కోకో ఆర్డినేటర్ శివకుమార్ నేత, రైతులు, ప్రజా ప్రతినిధులు, రైతుసంఘాలు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో కార్తీకమాసం పూజలు



**జయభేరి, దేవరకొండ :**

శ్రీ భక్త మార్కండేయ, భవాని మృత్యుంయేశ్వర దేవస్థానంలో రాత్రి లకు ధ్వజస్తంభ ఆకాశ దిపోత్సవ పూజలు జరిపి ఆకాశ దీపోత్సవం దేవస్థానం అధ్యక్ష దంపతులు వనం సుజాత జగదీశ్వర్, కోశాధికారి దంపతులు చేరిపల్లి జయలక్ష్మి యల్లయ్యలు నిర్వహించారు. భక్తులు దేవస్థానంలో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ పూజారి మహేష్ భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రావిరాల చిన్న వీరయ్య, మాకం చంద్రమౌళి, రావిరాల అరుణ రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.

# చదువుకొని ప్రయోజకులు కావాలి

**జయభేరి, చర్ల, అక్టోబర్ 24 :**




విద్యార్థులు చదువుకొని ప్రయోజకులు కావాలని ఇందుకు గాను ఇప్పటి నుండే ఖచ్చితమైన ప్రణాళిక రూపొందించుకోవాలని న్యాయవాది పరిటాల సంతోష్ కుమార్ అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ బొబ్బిలిపాటి రవికిరణ్ జన్మదినం సందర్భంగా పరిటాల సంతోష్ కుమార్ నేతృత్వంలోని మిత్రబృందం వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం నిలయ విద్యార్థులకు భోజన ఏర్పాట్లతో పాటు రెండు వాటర్ గీజర్లను అందచేసారు. ఈ సందర్భంగా వనవాసీ ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాయవాది పరిటాల సంతోష్ కుమార్ విద్యార్థులను ఉద్దేసించి మాట్లాడాను. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించి ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తాము ఏమి కావాలో చిన్ననాటి నుండే లక్ష్యాన్ని నిర్దేసించుకొని ముందుకు సాగినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాదించవచ్చని అన్నారు. ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణ తనకు ఎంతగానో ఆకట్టుకుందని అందుకే గతంలో పాదరక్షలు, స్కూల్ బ్యాగులను పంపిణీ చేసినట్లు తెలిపారు. మద్ది లక్ష్మి నరసింహారెడ్డి మాట్లాడుతూ తమ స్నేహితుడు కిరణ్ అందించిన స్పూర్తితో జన్మదినాల సందర్భంగా డబ్బు వృదా చేయకుండా విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. వనవాసీ విద్యార్థులు రానున్న శీతాకాలంలో చలికి ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో గీజర్లను అందచేసినట్లు వెల్లడించారు. కొమరం భీం విద్యార్ది నిలయం కార్యదర్శి జవ్వాది మురలీకృష్ణ మాట్లాడుతూ వనవాసీ విద్యార్థులకు దాతలు అందచేస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగపరుచుకొని దాతల నమ్మకాన్ని వమ్ముచేయకుండా చదువుపై దృష్టిసారించి ఉన్నత స్దితికి చేరుకోవాలని అన్నారు. విద్యతోనే వినయం విదేయత వస్తుందని, కుటుంబంలో ఒక్కరు చదువుకొని జీవితంలో స్దిరపడితే ఆకుటుంభం మొత్తం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అందుకే తాను విద్యపై దృష్టిసారించి పేద విద్యార్థులకు సహకారమందించడంతో పాటు వారిని ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. వనవాసీ సంస్ద ఏ ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం పొందదని, కేవలం దాతల ద్వారానే నడుస్తుందన్నారు. గిరిజనుల సంక్షేమం, విద్యార్థుల అభ్యున్నతి కొరకు పాటుపడే సంస్దకు దాతలు తమవంతు సహకారమందించి విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో నిలయ కమిటీ ఉపాద్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, బొబ్బిలి పాటి రవికిరణ్, ముసలి సతీష్, అంబోజి సతీష్, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- కార్మిక వ్యతిరేక చట్టాలు గొడ్డలి పెట్టు లాంటిది
- గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలి
- పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి
- పాలడుగు భాస్కర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**జయభేరి, గార్ల, అక్టోబర్ 24:**




కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలు సంఘటిత, అసంఘటితంగా కార్మికులకు గొడ్డలి పెట్టు లాంటిదని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఐదవ మహాసభలను మండల కేంద్రంలోని ఏవిఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ విధానాలను అనుసరిస్తూ సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల హక్కులను హరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే కార్మికుల పనిగంటలను పెంచారని తెలిపారు. రాష్ట్రంలో ఎంతో ఆశతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కారోబార్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేసి పంచాయతీ సిబ్బందిని రెండో పిఆర్సి పరిధిలోకి తీసుకొని, కనీస వేతనం రు. 26 వేల రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నప్పటికీ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులు మరణిస్తే బాధిత కుటుంబాలకు 10 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని అన్నారు. మహాసభ ప్రారంభానికి ముందుగా గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు అమరజీవి బూడిద అరుణ్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ మహాసభలో వంగూరి రాములు, కందునూరి శ్రీనివాస్, అలవాల సత్యవతి, అలవాల రామకృష్ణ, కుంట ఉపేందర్, ఆకుల రాజు, కుమ్మరి కుంట్ల నాగన్న, బండ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాట తప్పని మడమ తిప్పని జాతి యాదవ జాతి

- గుండ్లపోచంపల్లిలో ఘనంగా సదరు సమ్మేళనం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల

**జయభేరి, మేడ్చల్ :**




మాట తప్పని మడమ తిప్పని జాతి యాదవ జాతి అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉనిగొర్ల రాము యాదవ్ అధ్యక్షతన సదరు సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. దున్నపోతుల విన్యాసాలు, విద్యుత్ దీపాలు, డిజే సౌండ్స్, యువకుల తీన్మార్ నృత్యాల తో సదరు వేడుక ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పని జాతి యాదవ జాతి అన్నారు. ప్రకృతిని నమ్ముకుని సమాజానికి మంచి ఆహారాన్ని అందించే యాదవ జాతి అని సృష్టి కర్త శ్రీకృష్ణుడు జన్మించిన గొప్ప వంశం యాదవుల జాతి అని ఈటల పేర్కొన్నారు. దేశంలో అత్యధికంగా ఉన్న సమాజం యాదవ సమాజం అన్నారు. దేశ సేవకు ఎంతోమంది రాజకీయ నేతలను అందించిన యాదవ సమాజం నేటితరం యువకులకు ఆదర్శమని ఈటల తెలిపారు. దేశంలో కనుమరుగు అవుతున్న హిందు సంస్కృతి సంప్రదాయాలు, పండుగలు రాబోయే తరాలకు అందించాలంటే ఇలాంటి వేడుకలు దోహదం చేస్తాయన్నారు. ప్రకృతిని పూజించుకునే ఇలాంటి ఉత్సవాలు అందరూ సంబరంగా జరుపుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి లు, మాజీ కౌన్సిలర్లు, పలు రాజకీయ పార్టీల నేతలు, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పంచరామ క్షేత్రాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు

**జయభేరి, దేవరకొండ :**




ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఎంతో పవిత్రమైన కార్తీక మాసం పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ లోని పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు నడిపిస్తున్నట్లు ఇన్చార్జి డిపో మేనేజర్ పడాల సైదులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమరావతి(అమరలింగేశ్వర స్వామి దేవాలయం), భీమవరం(సోమేశ్వర స్వామి దేవాలయం), పాలకొల్లు( క్షీర లింగేశ్వర స్వామి దేవాలయం), ద్రాక్షారామం( భీమేశ్వర స్వామి దేవాలయం), సామర్లకోట( భీమలింగేశ్వర స్వామి దేవాలయం) లను ఒకే రోజు దర్శించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా తిరుగు ప్రయాణంలో విజయవాడ శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునే అవకాశం ప్రత్యేకంగా కల్పించడం జరిగిందన్నారు. పెద్దలకు రూ.2200, పిల్లలకు రూ.1400 చార్జీలు వర్తిస్తాయని తెలిపారు. ఈనెల 26, నవంబర్ 2, 9, 16 తేదీల్లో ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు దేవరకొండ ఆర్టీసీ బస్ స్టేషన్ నుంచిస బస్ స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలను దర్శించి పరమ శివుని ఆశీస్సులు పొందాలని కోరారు. తెలంగాణలోని పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు కూడా ప్రత్యేకంగా భక్తుల కోరిక మేరకు బస్సులు నడపనున్నట్లు తెలిపారు. బుకింగ్ కోసం 9949026631, 9848847419, 9666599890, 9441340163 నంబర్లను సంప్రదించాల్సిందిగా సూచించారు.



# నిత్య భజనలులో భాగంగా భజనలు

**జయభేరి, దేవరకొండ :**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో రాత్రి ఆకాశదీపం కార్యక్రమం నిర్వహించి నిత్య భజనలు ప్రోగ్రాం లో భాగంగా ఈరోజు శుక్రవారం సందర్భంగా తేలుకుంట్ల రవి ఆధ్వర్యంలో భజనలు వైభవంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో తేలు కుంట్ల రవి, శీల వెంకయ్య, గందె కృష్ణయ్య, గందె శ్రీనివాస్, గార్లపాటి శ్రీనివాస్, ఆలంపల్లి మురళి, గుద్దేటి సత్యం, ఇడుకుల్ల పుల్లయ్య, గోవిందు అనంతం, రాంబాబు, దొడ్డి శ్రీనివాస్, ఊరుకొండ సత్యనారాయణ, గందె శ్రీనివాస్ (ఫైనాన్స్ )తేలు కుంట్ల శైలజ, ఆలంపల్లి దీపిక, తెగటిపల్లి మాధవి, సాదెమ్మ, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



**జయభేరి, దేవరకొండ :**

ఇటీవల జరిగిన SGF అండర్ 14 బాలికల విభాగంలో దేవరకొండ నుండి కబడ్డీ మాస్టర్ చరణ్ ఆధ్వర్యంలో పఠాన్ చెరువులో జరిగిన కబడ్డీ పోటీలకు వెళ్లిన ప్లేయర్స్ లో జాతీయ స్థాయిలో రాష్టం నుండి ఇద్దరు ఎంపిక అవడం అందులో దేవరకొండ నుండి V. ఉదీపాన ఎంపిక అవ్వడం ఎంతో గర్వ కారణం అని Rk సేవా ఫౌండేషన్ అధ్యక్షులు పున్న రామకృష్ణ తెలియజేసినారు. ఈ సందర్బంగా త్వరలో గుజరాత్ లో జరిగే పోటీలకు మా వంతు సహాయం చేస్తాం అని చెప్పారు. కోచ్ చరణ్ వారి పట్ల శ్రద్ధ, వారిలో నైపుణ్యం పెంపోంధించి జాతీయ స్థాయిలో ఎంపిక అయ్యేలా ప్రోత్సహించిన తీరు అభినందనియం అని సీనియర్ జర్నలిస్ట్ ముసిని అంజన్ తెలిపారు. వారిని ఫౌండేషన్ సభ్యులు సన్మానం చేసి జ్ఞాపికను ప్రదానం చేసారు. కోచ్ చరణ్ మాట్లాడుతూ వారికీ సహకరించినందుకు ధన్యవాదములు తెలుపుతూ జాతీయ స్థాయిలో ఎంపికైన ఉదీపాన కు చేయూత, సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కరాటే మాస్టర్ చిత్తనూరి శ్రీనివాస్, ఎండీ అన్వార్, జనరల్ సెక్రటరీ పొట్ట విజయ్ కుమార్, డాన్స్ మాస్టర్ జగన్, శరత్, గుండాల వెంకట్ యాదవ్, కొండ ప్రేమ్ కుమార్, టీ. ప్రతాప్, ఆకాష్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**జయభేరి, మేడ్చల్ :**

గుండ్లపోచంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిదిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ విజయ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దూలపల్లి 33/11 కేవీ ఫిడర్ మరమ్మతు పనుల కారణంగా ఉదయం 10:00 గం.ల నుండి మధ్యాహ్నం 3:00 గం.ల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ తెలిపారు. విద్యుత్ నిలిపివేత ప్రభావిత ప్రాంతాలైన దూలపల్లి రోడ్డు, గుండ్లపోచంపల్లి విలేజ్, స్కైలబ్ బిల్డర్స్, ప్రైమ్ ఏప్స్ లాన్ అపార్ట్మెంట్, రైల్వే గేట్ రోడ్డు, డిఆర్ఎస్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ పేర్కొన్నారు.



# నాకో బ్యాడ్ హాబిట్ ఉంది!

దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా ఏం చేసినా సంచలనమే. 'అర్జున్ రెడ్డి' 'యానిమల్' చిత్రాలతో ఫిల్మ్‌మేకింగ్, స్టోరీ ప్రజెంటేషన్ పరంగా కొత్త ఒరవడిని సృష్టించారు. ఈ స్టార్ డైరెక్టర్ ప్రస్తుతం ప్రభాస్‌తో 'స్పిరిట్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. గురువారం ప్రభాస్ జన్మదినం సందర్భంగా ఆయన తాజా చిత్రాల సంగతులతో పాటు కొత్త పోస్టర్స్ అభిమానుల్ని అలరించాయి. సౌండ్‌స్టోరీ పేరుతో 'స్పిరిట్' చిత్రానికి సంబంధించిన ఓ ఆడియో క్లిప్‌ని రిలీజ్ చేశారు. ఇందులో కేవలం సంభాషణల ద్వారానే కథాంశం గురించి బేసిక్ డిటేయిల్స్ అందించే ప్రయత్నం చేశారు. ప్రభాస్, ప్రకాష్‌రాజ్ మధ్య చోటుచేసుకునే ఇంటెన్స్ డైలాగ్ వార్ గూజ్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఆడియో క్లిప్‌లోని సంభాషణలను బట్టి ఈ సినిమాలో ప్రభాస్ ఐపీఎస్ ఆఫీసర్ అని అర్థమవుతున్నది.

అయితే ప్రవర్తన సరిగ్గా లేదనే కారణంతో రిమాండ్ ఖైదీగా జైలుకి వెళ్తాడు. అక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రకాష్‌రాజ్..ప్రభాస్‌ని ఖైదీ డ్రెస్‌ను ధరించమని ఆదేశిస్తాడు. అందుకు తిరస్కరించిన ప్రభాస్ 'డియర్ సూపరింటెండెంట్ సార్.. చిన్నప్పటి నుంచి నాకో చెడ్డ అలవాటు ఉంది. రైట్ ఫ్రమ్ మై చైల్డ్‌వుడ్.. ఐ హ్యావ్ ఏ బ్యాడ్ హాబిట్' అని చెప్పడం హైలైట్‌గా నిలిచింది. ఈ డైలాగ్‌ని బట్టి ప్రభాస్ క్యారెక్టర్ ధిక్కార స్వభావంతో ఉండబోతున్నదని అర్థమవుతున్నది. సినిమా గ్లింప్స్‌ని ఆడియో ద్వారా తెలియజేయడం ఇదే ప్రథమమని.. సరికొత్త ప్రయోగమిదని అంటున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన త్రిప్తి డిమ్రి కథానాయికగా నటిస్తున్నది. ఈ పాన్ ఇండియా చిత్రం త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది.

# శ్రీలంకలో 'పెద్ది' సందడి



రామ్‌చరణ్ తాజా చిత్రం 'పెద్ది' ఫస్ట్ గ్లింప్స్‌తోనే సినీ ప్రేమికుల్లో ఆసక్తినిరేకెత్తించింది. ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్‌చరణ్ మేకోవర్, ఆయన రగ్‌గ్డ్ లుక్స్ అభిమానుల్ని సర్‌ప్రైజ్ చేశాయి. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. తాజా షెడ్యూల్ కోసం చిత్రబృందం శ్రీలంకకు పయనమైంది.

అక్కడ ఓ పాటతో పాటు కొన్ని కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నారు. ఈ చిత్రంలో రామ్‌చరణ్ ఆటకూలీగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన జాన్వీకపూర్ సందడి చేయనుంది. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాణం: వృద్ధి సినిమాస్, సమర్పణ: మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, రచనదర్శకత్వం: బుచ్చిబాబు సానా.



# కుందనపు బొమ్మలా రుక్మిణి..


కన్నడలో సూపర్ హిట్ అయిన సినిమా సప్త సాగరాలు దాటి సినిమా. ఇందులో రక్షిత్ శెట్టి హీరోగా నటించగా.. కథానాయికగా అందరి దృష్టిని ఆకర్షించింది రుక్మిణి వసంత్. బీర్బల్ సినిమాతో హీరోయిన్‌గా తెరంగేట్రం చేసిన ఈ వయ్యారి హిందీలో అప్ స్టైర్స్ అనే సినిమాలో నటించింది. మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్న ఈ వయ్యారికి ఇప్పుడు సోషల్ మీడియా భారీ ఫాలోయింగ్ వచ్చేసింది. సప్త సాగరాలు దాటి సినిమాతో సౌత్ ఇండస్ట్రీలో ఒక్కసారిగా ఫేమస్ అయ్యింది ఈ హీరోయిన్. ఈ సినిమా ఆమెకు స్టార్ ఇమేజ్ తెచ్చిపెట్టింది. దీంతో తెలుగుతోపాటు కన్నడలోనూ ఈ బ్యూటీకి వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. కన్నడలో శ్రీమురళీకి జోడిగా భఘీర చిత్రంలో నటించింది. ఈ సినిమా పర్లేదు అనిపించుకుంది.. అలాగే నిఖిల్ సరసన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో చిత్రంలో నటించింది. ప్రస్తుతం కన్నడ, తెలుగులో మరిన్ని ఆఫర్స్ అందుకుంది. ఇటీవలే తమిళంలో విజయ్ సేతుపతి జోడిగా ఏస్ అనే సినిమాలో నటించింది. ఇక ఇప్పుడు ఎన్టీఆర్ నటిస్తున్న డ్రాగన్ సినిమాలోనూ ఛాన్స్ దక్కించుకుందని టాక్. ప్రశాంత్ నీల్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా రుక్మిణి తన ఇన్‌స్టాలో షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. కవ్వించే కళ్లు.. నిషా చూపులతో చంపేస్తోంది ఈ చిన్నది. ప్రస్తుతం ఈ అమ్మడు ఫోటోలు చూసి ఫిదా అవుతున్నారు ఫ్యాన్స్.



# మామూలోడు కాదు మనోడు రసికుడు..

రెండు చేతులా సంపాదిస్తున్నాడు. తన కామెడీ పంచ్ లతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాడు నరేష్. ఈ చిన్నోడు గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆసక్తికర కామెంట్స్ చేశాడు. సీరియల్ నటి షబీనా షేక్ తో.. జబర్దస్త్‌లో లవ్ ట్రాక్ నడిపాడు నరేష్. స్టేజ్ పై ఆమెను పడేయడానికి నానా ప్రయత్నాలు చేసి ప్రేక్షకులకు నవ్వించేవాడు. ఆమె చుట్టే తిరిగేవాడు. తోటి కంటెస్టెంట్స్ కూడా వీరిద్దనీ లవర్స్ గానే కామెంట్స్ చేసేవారు. వాళ్ల స్కిట్స్‌లో వీరిద్దరి ఎఫైర్ పై పంచ్ లు వేసేవారు. దీంతో ఈ ఇద్దరూ నిజంగా లవ్ లో ఉన్నారని అందరూ అనుకున్నారు. ఈ క్రమంలేనే నబీనా రీసెంట్ గా మరో వ్యక్తిని పెళ్లి చేసుకుంది. దీంతో నబీనా నరేష్‌కు హ్యాండిచ్చింది అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ వినిపించాయి. కట్ చేస్తే.. దీనిపై నరేష్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనది రియల్ లవ్ కాదని.. స్కిట్ లవ్ అంటూ రివీల్ చేశాడు. తమ ఇద్దరి మధ్య లవ్ ట్రాక్ క్రియేట్ చేసింది రోజా అని షాకింగ్ విషయం చెప్పాడు. అది కేవలం స్టేజ్ వరకే అన్నాడు. ఇక షబీనా తనను పెళ్ళికి పిలిచిందని.. కానీ పెళ్లి గుంటూరులో కావడంతో తాను వెళ్ళలేకపోయానంటూ చెప్పాడు. పెళ్ళికి వెళ్తే తనను చూసి పీటల మీద నుంచి వచ్చేసేదేమో.. అంటూ సరదాగా అన్నాడు నరేష్. అంతేకాదు తన పెళ్లి గురించి కూడా క్లారిటీ ఇచ్చాడు ఈ జబర్దస్త్ నరేష్. ఇంకో రెండేళ్లలో తాను పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. తనకు అందంగా.. మోడ్రన్ గా ఉన్న అమ్మాయిలే కావాలనే రూల్ లేదని.. తన తల్లిదండ్రులను మంచిగా చూసుకునే అమ్మాయి అయితే చాలన్నాడు. అలాగే ఇండస్ట్రీ అమ్మాయి అయినా.. బయట అమ్మాయి అయినా తనకు పర్లేదని చెప్పుకొచ్చాడు ఈ చోటా కమెడియన్.

# పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌కి నెట్‌ఫ్లిక్స్ ప్రత్యేక ట్రిబ్యూట్..
# "ఎవ్వరికి అందదు అతని రేంజ్!"




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన సినిమా విడుదల అంటేనే ఫ్యాన్స్‌లో జోష్, థియేటర్ల వద్ద హంగామా ఏ రేంజ్‌లో ఉంటుందో మనందరికి తెలిసిందే. ఇటీవల పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన "ఓజీ" సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ యాక్షన్ ఎంటర్టైనర్ విడుదలైన తొలి రోజే ₹154 కోట్ల గ్రాస్ కలెక్షన్ సాధించింది.

ఇప్పటివరకు ₹335 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి పవన్ కళ్యాణ్ కెరీర్‌లోనే కాదు, తెలుగు సినీ చరిత్రలో కూడా సరికొత్త రికార్డులు నెలకొల్పింది.

ఇటీవల నెట్‌ఫ్లిక్స్‌లో "ఓజీ" సినిమా స్ట్రీమింగ్ ప్రారంభమైంది.ఇక దీపావళి కానుకగా ఓటీటీ ప్లాట్‌ఫామ్ నుంచి పవన్ కళ్యాణ్‌కి ఒక అదిరిపోయే ట్రిబ్యూట్ వీడియో విడుదల చేశారు. ఆ వీడియోలో పవన్ కళ్యాణ్ పెయింటింగ్‌ను దీపాలతో కళాత్మకంగా అలంకరించారు. ఇది అభిమానుల హృదయాలను తాకేలా రూపొందించబడింది. నెట్‌ఫ్లిక్స్ వంటి అంతర్జాతీయ స్థాయి సంస్థ ఒక భారతీయ హీరోకి ఇలాంటి ట్రిబ్యూట్ ఇవ్వడం ఇదే మొదటిసారి. ఆ ఘనతను సొంతం చేసుకున్న ఏకైక స్టార్ పవన్ కళ్యాణ్ అవ్వడం గర్వకారణం.

నెట్‌ఫ్లిక్స్ వీడియో చూసి పవన్ కళ్యాణ్ అభిమానులు సోషల్ మీడియాలో ఫుల్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. "ఎవ్వరికి అందదు అతని రేంజ్" అంటూ ఓజీ సినిమాలోని లిరిక్‌తో కామెంట్లు షేర్ చేస్తున్నారు. కేవలం పవన్ ఫ్యాన్స్ మాత్రమే కాదు, ఇతర హీరోల అభిమానులు కూడా ఈ క్రియేటివ్ ట్రిబ్యూట్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.ఇక పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాజకీయ కార్యక్రమాలతో బిజీగా ఉన్నప్పటికీ, త్వరలో దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో "ఓజీ సీక్వెల్ లేదా ప్రీక్వెల్" ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది. పవర్ స్టార్ క్రేజ్ అంటే ఓ రేంజ్! థియేటర్‌లో గాని, ఓటీటీలో గాని పవన్ కళ్యాణ్ హంగామా ఓ రేంజ్‌లోనే ఉంటుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**